

## నూతన ఆవిష్కరణల అడ్డాగా హైదరాబాద్

### రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): నూతన ఆవిష్కరణలకు ప్రపంచ గమ్యస్థానంగా హైదరాబాద్ తన స్థానాన్ని సుస్థిరపరుచుకుంటున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో సత్వ నాలెడ్జ్ పార్క్‌లో ఎవర్‌నార్థ్ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ హబ్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. 4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ జీసీసీ సెంటర్‌తో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి కల్పించనున్నదని, దీంట్లోభాగంగా తొలి విడుత వెయ్యి మంది ప్రతిభావంతులకు ఉద్యోగ అవకాశాలను లభించనున్నాయని, ఈ ఆధునిక కేంద్రం హైదరాబాద్‌లోని నిపుణుల సామర్థ్యాన్ని వినియోగించుకొని ఆరోగ్యరంగంలో ఐటీ వినియోగాన్ని మరింత విస్తృతపరుస్తున్నదన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. భారత్‌లో ఏర్పాటు చేసిన తొలి గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ఇదేనన్నారు. బెంగళూరుకు చెందిన సిగ్నా హెల్త్ సొల్యుషన్స్‌తో కలిసి భారత్‌లో డాటా, అనలిటిక్స్ సేవలు అందిస్తున్నది. ఈ భాగస్వామ్యం ద్వారా ఎవర్ నార్థ్ 1.9 కోట్ల మంది భారతీయులకు ఆరోగ్య సేవలు అందిస్తున్నది. 30కి పైగా దేశాల్లో కార్యకలాపాలను విస్తరించిన ఎవర్‌నార్థ్‌లో ప్రస్తుతం 75 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

# హైదరాబాద్ ఆఫీస్‌కు గిరాకీ నై

### తగ్గిన కొత్త ఆఫీస్ స్పేస్ సప్లై, లీజింగ్

### 25 శాతం చొప్పున పతనం

### జూలై-సెప్టెంబర్‌కుగాను వెస్టియన్ నివేదిక

*తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దాదాపు పదేండ్లపాటు అత్యధిక డిమాండ్‌ను చూసిన హైదరాబాద్ రియల్టీకి ఇప్పుడు ఆదరణే కరువైపోయింది.*

*అటు హౌజింగ్ మార్కెట్, ఇటు ఆఫీస్ మార్కెట్ రెండూ కుప్పకూలుతున్నాయి మరి. ఎన్నో ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీలు విడుదల చేస్తున్న వరుస నివేదికలే ఇందుకు నిదర్శనం.*

*తాజాగా దేశీయ రియల్టీపై అందులో హైదరాబాద్ ఆఫీస్ మార్కెట్ తీరుతెన్నులపై రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ ఓ రిపోర్టునిచ్చింది. ఇందులో ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఆఫీస్ స్పేస్ సప్లై, లీజింగ్ 25 శాతం పడిపోయినట్టు తేలింది.*

న్యూఢిల్లీ, నవంబర్ 19: హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పరుగులకు బ్రేక్ పడిందా?.. సుమారు దశాబ్దకాలం కనిపించిన డిమాండ్ ఇప్పుడు కనుమరుగైపోతున్నదా?.. అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. కన్సల్టెన్సీ ఏదైనా.. చెప్పేది మాత్రం ఒక్కటే. అదే.. హైదరాబాద్ నిర్మాణ రంగంలో నిస్తేజం ఆవరిస్తున్నదని. ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ విడుదల చేసిన తాజా నివేదిక సైతం ఇదే చెప్తున్నది. మంగళవారం వచ్చిన ఈ రిపోర్టు.. హైదరాబాద్‌లోని ఆఫీస్ స్పేస్‌కు గిరాకీ అంతంతమాత్రంగానే ఉన్నట్టు తేల్చింది. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో మార్కెట్‌లోకి కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఆఫీస్ స్పేస్ గతంతో చూస్తే 25 శాతం తగ్గినట్టు పేర్కొన్నది. 4.1 మిలియన్ చదరపు అడుగులకే పరిమితమైనట్టు స్పష్టం చేసింది. అలాగే ఇదే సమయంలో లీజింగ్ కార్యకలాపాలు సైతం 25 శాతం క్షీణించి 2.79 మిలియన్ చదరపు అడుగుల వద్దే ఉన్నట్టు వెల్లడైంది.

**రివర్స్ గేర్‌లో..**

దేశవ్యాప్తంగా కార్పొరేట్ కంపెనీలకు తమ కార్యాలయాల ఏర్పాటుకు ముందు గుర్తొచ్చేదే హైదరాబాద్. ఒకప్పుడు బెంగళూరు, ముంబైలకు ఈ ఘనత దక్కినా.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో సుమారు పదేండ్లపాటు అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, అందించిన సహకారంతో ఆ నగరాల స్థానంలోకి హైదరాబాద్ వచ్చి చేరింది. ఐటీ, ఐటీ అనుబంధ రంగాలు, ఫార్మా, బయోసైన్స్, ఏవియేషన్, డాటా సెంటర్లు ఇలా అన్నింటికీ హైదరాబాదే ప్రధాన కేంద్రంగా విరాజిల్లింది. కానీ ఇప్పుడు ఆ ఉత్సాహం సన్నగిల్లింది. హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకొనేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆఫీస్ స్పేస్ సప్లై కూడా అందుకు తగ్గట్టుగానే తగ్గుతూ వస్తున్నది. దీనిపై రియల్టీ వర్గాల్లో ఆందోళనలు పెరుగుతున్నాయి.

**ఢిల్లీ, బెంగళూరుల్లో..**

ఓ వైపు హైదరాబాద్‌లో కొత్తగా వచ్చే ఆఫీస్ స్పేస్ క్షీణిస్తుంటే.. మరోవైపు బెంగళూరు, ఢిల్లీల్లో అది పెరుగుతూపోవడం గమనార్హం. ఈ జూలై-సెప్టెంబర్‌లో బెంగళూరులో అందుబాటులోకి వచ్చిన నూతన ఆఫీస్ స్పేస్ 3.6 మిలియన్ చదరపు అడుగులు. గతంతో పోల్చితే 33 శాతం ఎక్కువ. అలాగే ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోనూ 2.3 మిలియన్ చదరపు అడుగులకు ఎగిసింది. మునుపటితో చూస్తే ఇది ఏకంగా 360 శాతం పెరగడం విశేషం. ముంబైలో 0.90 మిలియన్ చదరపు అడుగులతో యథాతథంగా కొత్త ఆఫీస్ స్పేస్ సరఫరా ఉన్నది. చెన్నైలో స్వల్పంగా తగ్గగా, కోల్‌కతాలో ఏ-గ్రేడ్ ఆఫీస్ స్పేస్ సప్లైనే లేదని వెస్టియన్ చెప్పింది. పుణెలో మాత్రం 26 శాతం తరుగుదల కనిపించింది. దీంతో హైదరాబాద్‌సహా దేశంలోని ఈ ఏడు ప్రధాన నగరాల్లో ఓవరాల్‌గా మార్కెట్‌లోకి కొత్త ఆఫీస్ స్పేస్ రాక 4 శాతం పడిపోయి జూలై-సెప్టెంబర్‌లో 12.8 మిలియన్ చదరపు అడుగులుగా నమోదైనట్టు వెస్టియన్ ఈ సందర్భంగా స్పష్టం చేసింది.



**లీజింగ్‌లో..**

ఈ జూలై-సెప్టెంబర్‌లో బెంగళూరులో లీజింగ్ కార్యకలాపాలు 84 శాతం ఎగిసి 6.63 మిలియన్ చదరపు అడుగులకు చేరుకున్నాయి. పుణెలో 112 శాతం పెరిగి 2.33 మిలియన్ చదరపు అడుగులుగా నమోదైంది. చెన్నైలో లీజింగ్ కార్యకలాపాలు యథాతథంగానే ఉండగా, ముంబైలో స్వల్ప క్షీణత కనిపించింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 17 శాతం, కోల్‌కతాలో 45 శాతం తగ్గాయి. ఇక బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్స్యూరెన్స్ రంగాల్లో డిమాండ్ ఉన్నట్టు వెస్టియన్ చెప్తున్నది.

# ఇక బ్యాంకుల వంతు

### నాలుగు బ్యాంకుల్లో వాటా విక్రయించే దిశగా కేంద్రం



న్యూఢిల్లీ, నవంబర్ 19: ప్రభుత్వరంగ బ్యాంకుల్లో వాటాను విక్రయించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నది. సెబీ మార్గదర్శకాలకు లోబడి నాలుగు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వాటాను విక్రయించబోతున్నది. వీటిలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, యూకో బ్యాంక్, పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్‌లు ఉన్నాయి. వీటిలో సెంట్రల్ బ్యాంక్‌లో కేంద్రానికి 93 శాతం వాటా ఉండగా, ఇండియన్ ఓవర్‌సీస్‌లో 96.4 శాతం, యూకోలో 95.4 శాతం, పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్‌లో 98.3 శాతం వాటా ఉన్నది. మార్కెట్ రూల్స్ ప్రకారం స్టాక్ మార్కెట్లో లిస్టైన సంస్థల్లో పబ్లిక్ షేరుహోల్డర్లు 25 శాతం వాటా కలిగివుండాలనే నిబంధనకు అనుగుణంగా కేంద్రం ఈ వాటాలను విక్రయించడానికి సిద్ధమైంది. ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించనున్న ఈవాటాను ఎప్పటిలోగా, ఎంత శాతం వాటా విక్రయించేదానిపై ఇంకా స్పష్టత రాలేదు.

## అర్వతో ప్యూర్ ఈవీ ఒప్పందం

హైదరాబాద్, నవంబర్ 19: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన విక్రయ సంస్థ ప్యూర్ ఈవీ.. అంతర్జాతీయ మార్కెట్‌పై దృష్టి సారించింది. మధ్యప్రాచ్యం, ఆఫ్రికా దేశాల్లో తన వాహనాలను విక్రయించడానికి అర్వ ఎలక్ట్రిక్‌తో ఒప్పందం కుదుర్చుకున్నది. అక్కడి మార్కెట్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి డిస్ట్రిబ్యూషన్, ఎలక్ట్రిక్ మోటర్‌సైకిళ్లను విక్రయించడానికి ఈ ఒప్పందం దోహదం చేయనున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఒప్పందంలో భాగంగా వచ్చేరెండేండ్లలో 50 వేల యూనిట్ల ఎకోడ్రైఫ్ట్, ఈట్రైస్ట్ ఎక్స్ మోటార్‌సైకిళ్లను సరఫరా చేయనున్నది.

## రెడ్డీస్ ప్లాంట్‌పై యూఎస్ అభ్యంతరాలు

హైదరాబాద్, నవంబర్ 19: ప్రముఖ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌కు అమెరికా నియంత్రణ మండలి గట్టి షాకిచ్చింది. హైదరాబాద్‌కు సమీపంలోని బొల్లారం వద్ద ఉన్న ప్లాంట్‌ను అమెరికా హెల్త్ రెగ్యులేటరీ తనిఖీ చేసి ఏడు అభ్యంతరాలతో ఫామ్ 484 జారీ చేసిందని సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. బొల్లారం వద్ద ఉన్న ఏపీఏ తయారీకేంద్రం(సీటీవో-2)ను నవంబర్ 13 నుంచి 19 వరకు తనిఖీ చేశారు.

# గోల్డ్ లోన్లకూ ఈఎంఐలు

### పరిచయం చేసే యోచనలో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు

### రుణాల మంజూరులో లోపాల్ని గుర్తించిన ఆర్బీఐ



న్యూఢిల్లీ, నవంబర్ 19: గోల్డ్ లోన్లకూ త్వరలో ఈఎంఐలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం గృహ, వాహన, వ్యక్తిగత, విద్యా తదితర రుణాలకే నెలవారీ వాయిదా చెల్లింపుల (ఈఎంఐ) సౌకర్యం ఉన్నది. బంగారాన్ని తాకట్టు పెట్టి తీసుకునే అప్పులకు ఈ సదుపాయం లేదు. అయితే ఈ రుణాల మంజూరులో ఆర్బీఐ రకరకాల లోపాలను గుర్తించింది. దీంతో బ్యాంకులు, గోల్డ్ లోన్ కంపెనీల వంటి బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు బంగారంపై రుణాలకూ ఈఎంఐలను తేవాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది.

**ఇదీ సంగతి..**

బంగారు ఆభరణాలను తనఖా పెట్టి తీసుకునే రుణాల్లో లోపాలను గుర్తించామని ఈ సెప్టెంబర్ 30న ఓ సర్క్యులర్‌లో ఆర్బీఐ తెలిపింది. విలువ, పరిశీలన, రుణగ్రహీత ఆర్థిక సామర్థ్యం, వేలం వంటి అంశాల్లో బ్యాంకులు, రుణదాతలు నిర్లక్ష్యం చేస్తున్నారన్నది. తీసుకున్న అప్పును తిరిగి చెల్లిస్తారా? లేదా? అన్నది చూడాలని ఆర్బీఐ అంటున్నది. దీంతో ఈఎంఐ ఆధారిత వ్యవస్థను గోల్డ్ లోన్లకూ తేవాలనుకుంటున్నట్టు బ్యాంకర్లు చెప్తున్నారు. కాగా, సెప్టెంబర్ 30 నాటికి బ్యాంకులు రూ.1.4 లక్షల కోట్ల గోల్డ్ లోన్లను ఇచ్చాయి. గతంతో పోల్చితే 51 శాతం పెరిగాయి.


## హైదరాబాద్‌లో జెప్టో కేఫ్

న్యూఢిల్లీ, నవంబర్ 19: ఈ-కామర్స్ జెప్టో తాజాగా కేఫ్ సర్వీసులను కూడా ప్రారంభించింది. ప్రస్తుతం ముంబై, ఢిల్లీ, బెంగళూరుల్లో 120 కేఫ్స్‌లను ఏర్పాటు చేసిన సంస్థ..త్వరలో హైదరాబాద్‌లో అడుగపెట్టబోతున్నట్లు ప్రకటించింది. 2026 నాటికి కేఫ్ వ్యాపారం ద్వారా రూ.1,000 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ.. అందుకు తగ్గట్టుగానే తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నట్లు జెప్టో సీఈవో అదిత్ పాలిచా తెలిపారు. పది నిమిషాల్లో నాణ్యమైన ఆహార పదార్థాలు అందించే సర్వీసులకు అనూహ్యంగా స్పందన లభించిందని, ఇదే క్రమంలో గతేడాదిగా మా బృందం కేఫ్‌ల కోసం ఎంతో పరిశోధన చేశారని, చేతితో తయారు చేసిన బ్రూయింగ్ టెక్నికల్‌ను ఉపయోగించి కాఫీను తయారు చేసే యంత్రాలను సేకరించినట్లు, తద్వారా కస్టమర్లకు కాఫీని అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కేఫ్ సర్వీసుల్లో 148 ఐటమ్స్‌ను అందిస్తున్నట్లు, బుకింగ్ చేసుకున్న పది నిమిషాల్లో ఇస్తున్నామన్నారు.

# వరుస పతనాలకు బ్రేక్

### సెన్సెక్స్ 239, నిఫ్టీ 65 పాయింట్ల లాభం

ముంబై, నవంబర్ 19: దేశీయ స్టాక్ మార్కెట్లు తిరిగి లాభాల్లోకి రాగలిగాయి. బ్యాంకింగ్, ఐటీ, వాహన షేర్ల నుంచి లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడైనప్పటికీ సూచీలు లాభాల్లో ముగిశాయి. వరుసగా నాలుగు రోజులుగా నష్టపోయిన సూచీలు ప్రారంభం నుంచే లాభాల బాట పట్టాయి. ఒక దశలో వెయ్యి పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 239.37 పాయింట్లు అందుకొని 77,578.38 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ ఏడు రోజుల పతనం నుంచి లాభాల్లోకి మళ్లింది. మార్కెట్ ముగిసే సమయానికి 64.70 పాయింట్లు అందుకొని 23,518.50 వద్ద స్థిరపడింది. గత ఏడు సెషన్లలో నిఫ్టీ 1,030 పాయింట్లు లేదా 4.3 శాతం పతనం కాగా, సెన్సెక్స్ 3,000 పాయింట్లు తగ్గి 77,300కి పడిపోయిన విషయం తెలిసిందే. ఎఫ్ఐఐలు అమ్మకాలకు మొగ్గుచూపడం, కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలు, అమెరికా బాండ్ ఈల్డ్ బలపడటం సూచీల పతనానికి ప్రధాన కారణాలు. మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, టాటా మోటర్స్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడగా..రిలయన్స్, ఎస్బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతి, టాటా స్టీల్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టపోయాయి.



## సంస్థ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలి

భూపాలపల్లి రూరల్, నవంబర్ 19: సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం ప్రతి ఉద్యోగి కృషి చేయాలని సెక్యూరిటీ కార్పొరేట్ జీఎం లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం ఆయన జీఎం రాజేశ్వర్‌రెడ్డిని కలిసి ఎస్టేట్ సమస్యలు, ల్యాండ్ ఎంక్రోచ్‌మెంట్, క్వార్టర్ వివరాలపై చర్చించారు. భూపాలపల్లి ఏరియాలోని ఓసీ-3 గనిని సందర్శించి కోల్ యార్డును పరిశీలించారు. ఎస్వీఈసీ క్యాంపులో ఉన్న డీజిల్ బంక్‌ను తనిఖీ చేశారు. ఓసీ-3 చెక్ పోస్ట్, వీటీఎస్, కేటీకే- 5 ఇంక్లైన్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కేటీకే ఓసీ- 2, ఎస్వీఈసీ క్యాంపు- 2, డిజిల్ బంకులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ కే మారుతి, ఎస్టేట్ ఆఫీసర్ పోషమల్లు, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ డీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## బొమ్మాపూర్‌లో చోరీ

మహదేవపూర్, నవంబర్ 19 : మండలంలోని బొమ్మాపూర్ ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై పవన్‌కుమార్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఎనగంటి శంకరమ్మ మంగళవారం ఉదయం వ్యవసాయ పనుల కోసం ఇంటికి తాళం వేసి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం, ఇంట్లో ఉన్న బీరువా తాళం పగలగొట్టి రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లారు. శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు

మహదేవపూర్, నవంబర్ 19 : ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్స్ దుకాణా యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని ఏడీఏ శ్రీపాల్ హెచ్చరించారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతు వేదిక సమావేశ మందిరంలో ఉమ్మడి మహదేవపూర్ మండల ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్స్ దుకాణా యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ డీలర్ విధిగా స్టాక్ రిజిస్టర్స్, బిల్స్ బుక్స్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఆదేశించారు. అలాగే లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోవాలని, ఇతర రాష్ట్రాలకు ఎరువులు సరఫరా చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఏవో సుప్రజ్యోతి, ఏఈవో ధర్మేందర్, ఫర్టిలైజర్ డీలర్స్ ప్రెసిడెంట్ అశోక్, జగదీశ్వర్, వెంకటరెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

## సీసీఎఫ్‌ను కలిసిన సింగరేణి జీఎం

భూపాలపల్లి రూరల్, నవంబర్ 19 : జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో చీఫ్ కన్సర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) బీ ప్రభాకర్‌ను మంగళవారం సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా భూపాలపల్లి సింగరేణి ఏరియాలో బొగ్గు ఉత్పత్తి కోసం చేపడుతున్న భూ సేకరణకు అటవీశాఖ అనుమతులు ఇవ్వాలని జీఎం సీసీఎఫ్‌ను కోరారు. ఆయన వెంట సింగరేణి అధికారులు శ్రీనివాసరావు, శివ నారాయణ, పోషమల్లు, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

## విద్య, వైద్యంపై ప్రభుత్వం దృష్టి సారించాలి

గోవిందరావుపేట, నవంబర్ 19 : రాష్ట్రంలో విద్య, వైద్యంతోపాటు ఉపాధి, ఇల్లు, భూమి ఇవ్వడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవాలని డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తరుణ్ మహరాజ్ అన్నారు. డీఎస్పీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మంగళవారం మండల తహసీల్దార్ సృజన్‌కుమార్‌కు పై సమస్యలు ప్రభుత్వం ద్వారా అందేలా చూడాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అన్వేష్, నాయకులు ఓదేలు పాల్గొన్నారు

## మంత్రికి కాంట్రాక్టు ఉద్యోగుల వినతి

ములుగురూరల్, నవంబర్ 19 : గిరిజన శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మంగళవారం గిరిజన కాంట్రాక్టు ఉద్యోగులు మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. వారిలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా పూల్‌సింగ్, శ్రీనాథ్, ఎర్రయ్య, రాజు, మంజు, బాలాజీ ఉన్నారు.

## చట్టాల రక్షణకు ఉద్యమించాలి

వెంకటాపురం(నూగూరు), నవంబర్ 19 : ఏజెన్సీలో ఆదివాసీ హక్కుల చట్టాల రక్షణకు ఆదివాసీ యువత ఉద్యమించాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. మంగళవారం మండలంలోని రాచపల్లి గ్రామంలో ఆదివాసీ సమస్యలపై సమావేశం నిర్వహించారు. నాయకులు ఆదినారాయణ, చంటి, లక్ష్మయ్య, సాయిబాబు పాల్గొన్నారు.

# యథేచ్ఛగా బహుళ అంతస్తుల నిర్మాణాలు

- ఏజెన్సీలో గిరిజన చట్టాలకు తూట్లు
- పట్టించుకోని అధికారులు

వాజేడు, నవంబర్ 19 : మండలంలోని చెరుకూరు, ధర్మవరం, పేరూరు తదితర గ్రామాల్లో 1/70 చట్టానికి విరుద్ధంగా ప్రధాన రహదారుల పక్కన కొందరు ఇప్పటికే బహుళ అంతస్తులు నిర్మిస్తే మరికొందరు నిర్మించే పనుల్లో నిమగ్నమయ్యారు. అయినా సంబంధితశాఖ అధికారులు దృష్టిసారించి బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల అండతోనే చట్టాలను ఉల్లంఘించి ఈ నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. సామాన్యుడు నిర్మాణం చేపడితే వెంటనే చర్యలు తీసుకునే అధికారులు కొందరు బడాబాబులు నిర్మిస్తున్నా పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు దృష్టిసారించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టే వారిపై చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ వీరభద్రప్రసాద్‌ను 'నమస్తే తెలంగాణ' ఫోన్లో వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. గిరిజనేతరులు ఎవరైనా నిబంధనలు అతిక్రమించి బహూళ అంతస్తుల భవన నిర్మాణాలు చేపడితే సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారావివరాలు సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.



చెరుకురు జాతీయ రహదారి పక్కన నిర్మిస్తున్న భవనం

## సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, నవంబర్ 19 : మున్సిపాలిటీ పరిధిలోని రెండు పడక గదుల ఇండ్ల సముదాయంలోని 23వ బ్లాకులో జరుగుతున్న కుటుంబ సర్వేను మంగళవారం కలెక్టర్ రాహుల్‌శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 23వ బ్లాకు పరిధిలో మొత్తం 208 ఇండ్లు ఉండగా, ఇప్పటి వరకు 180 ఇండ్ల సర్వే పూర్తయిందని ఎన్యూమరేటర్ కలెక్టర్‌కు వివరించారు. సర్వే నిర్వహణ పట్ల సంతృప్తి వ్య క్తం చేస్తూ ఎన్యూమరేటర్ కార్తీక్ ను అభినందించారు. సర్వేలో కుటుంబాలు తమ వివరాలను నమోదు చేయించుకునేందుకు హెల్ప్ లైన్ నంబర్ 8978180036 కు కాల్ చేయవచ్చని చెప్పారు. వేశాలపల్లి రెండు పడక గదుల ఇండ్ల సముదాయంలో నీటి సమస్య ఉందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తేగా ఆయన స్పందిస్తూ నీటి ట్యాంక్ పరిశీలించారు. నీటి సరఫరా కోసం మోటార్లు, వీధి లైట్లు ఏర్పాటుకు కృషి చేస్తానని, అధికారులతో చర్చించి మీ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

చిట్యాల, నవంబర్ 19 : విద్యార్థినిలు ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, చిట్యాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి సూచించారు. మంగళవారం మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఏబీవీపీ ప్రాంత కార్యసమితి సభ్యుడు వేల్పుల రాజకుమార్ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా స్త్రీ శక్తి దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం రాష్ట్రస్థాయిలో క్రీడల్లో పాల్గొన్న విద్యార్థినులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ చిట్యాల శాఖ అభిగ్న, వితిశ్, రాకేశ్, సన్ని, కృష్ణ పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడిగా రామువర్మ

మంగపేట, నవంబర్ 19 : ములుగు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కమలాపురం గ్రామానికి చెందిన పత్తిపాక రాము వర్మ నియామకమయ్యారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్‌లోని బీసీ సంక్షేమభవన్‌లో మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.

## గ్రామాల్లో పశువులకు వైద్య పరీక్షలు

ములుగురూరల్, నవంబర్ 19 : ములుగు మండలంలోని కొడిశలకుంట, మాన్‌సింగ్‌తండా గ్రామాల్లో వరంగల్ ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భశోక వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. మల్లంపల్లి పశువైద్యాధికారి వడ్డెపల్లి రమేశ్ పశువులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం 45పశువులకు గర్భస్థ వ్యాధి నివారణ మందులను అందజేశారు. కార్యక్రమంలో డీవీఏహెచ్‌వో డాక్టర్ నరసింహ, గోవిందరావుపేట పశువైద్యాధికారి రాజశేఖర్, రమేశ్, నర్సింహ, జేవీవో సౌమ్య, ఎల్ఎస్ఏ సుదర్శన్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఐలుమల్లు, గోపాలమిత్రలు సత్తిరెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

చిట్యాల, నవంబర్ 19 : మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి(సి) గ్రామంలో ఉమ్మగని రాజేశ్వరి, ఏలేటిరామయ్యపల్లి గ్రామంలో గొర్రె మల్లయ్య, కొత్తూరి రాంరెడ్డి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న చిట్యాల మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు రాజిరెడ్డి, నాయకులు పిట్ట సురేశ్, పాండ్రాల వీరస్వామి, రాజు, మర్రి నరేశ్, అశోక్, వెంకన్న ఉన్నారు.

## సీపీఎం మహా సభలను విజయవంతం చేయాలి

మహాముత్తారం, నవంబర్ 19 : సీపీఎం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మూడో మహా సభలను విజయవంతం చేయాలని పోలం చిన్న రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభలు 21, 22 తేదీల్లో కృష్ణకాలనీ సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో జరుగనున్నట్లు చెప్పారు. మహాసభను విజయవంతం చేయాలని, అలాగే 21న నిర్వహించే ర్యాలీలో పాల్గొనాలని ఆయన ప్రజలను కోరారు.

## సమస్యలు పరిష్కరించాలి

గణపురం, నవంబర్ 19: బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ మధురకవి సత్యనారాయణ కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ కుర్రి స్వామినాదన్ మాట్లాడుతూ పేదల జీవితాల్లో సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక మార్పు తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కండె రవి, మండల కమిటీ సభ్యులు ఇంజపెల్లి విక్రం, వడ్డేపల్లి శ్రీనివాస్, కుమారస్వామి పాల్గొన్నారు.

## యాదవ మహాసభ ఒడిపిలవంచ కార్యవర్గం ఎన్నిక

కాటారం, నవంబర్ 19 : అఖిల భారత యాదవ మహాసభ కాటారం మండలం ఒడిపిలవంచ గ్రామ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. డివిజన్ యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో ఈ కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా మొగిలి ఓదన్న, అధ్యక్షుడిగా వేముల రమేశ్, ఉపాధ్యక్షులుగా మొగిలి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా రాజేందర్, కోశాధికారిగా శ్రీను, సహాయ కార్యదర్శిగా మహేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అడ్‌హక్ కమిటీ సభ్యులు గడ్డం చంద్రయ్య, ఐలయ్య, దేవేందర్, తొట్ల శ్రీశైలం పాల్గొన్నారు.



సీఎం సభకు బస్సులను తరలించడంతో భూపాలపల్లి బస్ డిపో వద్ద ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

## బుగులోని జాతర ఆదాయం రూ.12.24లక్షలు

రేగొండ, నవంబర్ 19 : బుగులోని వేంకటేశ్వరస్వామి జాతర ఆదాయం రూ.12.24 లక్షలు వచ్చినట్లు చైర్మన్ రొంటల వెంకటస్వామి, ఈవో బిళ్లు శ్రీనివాస్ తెలిపారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీలను పాండవుల గుట్టల సమీపంలో మంగళవారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.5,48,445, ప్రత్యేక దర్శన టికెట్ ద్వారా రూ.2.73.200, గండ దీపం టికెట్ ద్వారా, రూ.8,760, కేశఖండన ద్వారా రూ.9,580, అర్చన ద్వారా రూ.15,550, తైబజారు ద్వారా రూ.18 వేలు, టెండర్ల ద్వారా రూ.3,50,500 వచ్చినట్లు చెప్పారు. లెక్కింపులో దేవాదాయశాఖ పరిశీలకులు ఎన్ కవిత, ధర్మకర్తలు పాల్గొన్నారు.

## అనుమతి లేని రోడ్డుకు అక్రమంగా మొరం తరలింపు

టేకుమట్ల, నవంబర్ 19 : గర్మిళ్ళపల్లి- ఓడెడ్ మానేరు వాగులో అనుమతి లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న రోడ్డుకు బూర్నపల్లి గ్రామ ప్రభుత్వ భూమిలోని గుట్ట మొరాన్ని అక్రమంగా తరలిస్తున్నారని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారెపల్లి మల్లేశ్ ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కొంత మంది ముఠాగా ఏర్పడి ప్రకృతి వనరులను ఇష్టం వచ్చినట్లు ధ్వంసం చేస్తున్నారన్నారు. ప్రకృతి సంపదను పెంచి, వనరులను కాపాడాల్సిన రెవెన్యూ, మైనింగ్, ఫారెస్ట్ ఇతర అధికారులు నియంత్రించకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొని సహజ వనరులను కాపాడాలని ఆయన కోరారు. దోపిడీకి పాల్పడుతున్న వారిపై, జేసీపీ, టిప్పర్ యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు చిట్యాల సదానందం, నరేశ్ పాల్గొన్నారు.

## ప్లాంటేషన్లను పరిశీలించిన రేంజర్

కాటారం, నవంబర్ 19 : అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్లాంటేషన్లు, నర్సరీలను కాటారం రేంజ్ అధికారి స్వాతి మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. కాటారం ఎఫ్ఆర్‌వోగా బదిలీపై వచ్చిన స్వాతి విధుల్లో చేరిన అనంతరం కాటారం నర్సరీ, గుమ్మళ్లపల్లి, వీరాపూర్ ప్లాంటేషన్లను పరిశీలించారు. మొక్కలు బాగా ఎదిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ సురేందర్, ఎఫ్‌బీవో సంజీవ్ పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అధికారులు

కాటారం, నవంబర్ 19 : మండలంలోని శంకరాంపల్లి, రేగులగూడెం, కొత్తపల్లి, గారెపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం మండల ప్రత్యేకాధికారి, డీహెచ్‌వో సంజీవరావు, తహసీల్దార్ నాగరాజు పరిశీలించారు. కేంద్రాల్లో రైతులకు కావాల్సిన సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమశాతం కొలిచే యంత్రాలు తదితర సౌకర్యాలపై ఆరా తీసి కొనుగోళ్ల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ రిలీఫ్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈవో ఎడ్ల సతీశ్, సిబ్బంది సాంబమూర్తి, అమీన్, రాజబాబు, దేవేందర్, బాపు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి

కృష్ణకాలనీ, నవంబర్ 19 : ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఉన్న ఆంక్షలను వెంటనే ఎత్తి వేయాలని సీఐటీయూ జిల్లా జాయింట్ సెక్రెటరీ ఆకుదారి రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మంగళవారం భూపాలపల్లి ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ఆర్టీసీ నిర్వహణలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ సుభాన్, సీహెచ్ రవికుమార్, కార్మికులు పాల్గొన్నారు.

## ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

గణపురం/ కాటారం, నవంబర్ 19 : దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలు గణపురం, కాటారం మండలకేంద్రాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ గణపురం గ్రామ అధ్యక్షుడు ఓరుగంటి కృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, విడిదినేని అశోక్, నాయకులు చోటే మియా, మోటపోతుల శివశంకర్‌గౌడ్, నారగాని దేవేందర్‌గౌడ్, దూడపాక దుర్గయ్య, కొవ్వూరు శ్రీనివాస్, నాయకపు రఘుపతి, శ్రీనివాస్, కాటారం మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ మండల అధ్యక్షుడు చీమల సందీప్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, నాయకులు శ్రీనివాస్, మొగిలి, నవీన్‌రావు, కొట్టె శ్రీవారి, ప్రభాకర్, అశోక్, భూపెల్లి రాజు, చీమల రాజు, కిరణ్, రాజబాయి, ప్రభుదాస్, శివ, రాజేందర్, శ్రీకాంత్, సంతోష్ పాల్గొన్నారు.